## క్లుప్తంగా

### దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

**జగిత్యాల:** దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆదేశించారు. బుధవారం దివ్యాంగుల పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీజీఏ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నాగరాజు, ప్రకాశ్, ప్రవీణ్, భాస్కర్, దేవదాసు, నర్సయ్య, గంగాధర్, శ్రీనివాస్, సంతోష్, శంకర్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**జగిత్యాలటౌన్/సారంగాపూర్:** జగిత్యాల పట్టణంలోని ఇందిరాభవన్‌లో బుధవారం బీర్‌పూర్ మండలానికి చెందిన పలువురు నాయకులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నాయకులు పూడూర్ రవీందర్, కొమ్ము వేణు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ ఆదేశిస్తే ఎంపీగా పోటీ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీర్పూర్ ఎంపీపీ మసర్తి రమేశ్, తోట శ్రీనివాస్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శంకర్ తదితరులు ఉన్నారు.

**ఎల్‌వోసీ అందజేత**

బీర్‌పూర్ గ్రామానికి చెందిన రవీందర్ అనే వ్యక్తి అనారోగ్యం పాలవ్వగా, నిమ్స్‌లో చికిత్స పొందడానికి ఎమ్మెల్సీ రూ. 2 లక్షల విలువ చేసే ఎల్‌వోసీని అందజేశారు.

### సీనియర్ సిటిజన్లు మార్గదర్శకులు

**జగిత్యాలటౌన్:** పెన్షనర్లు, సీనియర్ సిటిజన్లు సమాజానికి మార్గదర్శకులని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. హరి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యేను కలిసిన సీనియర్ సిటిజన్లు సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ సిటిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పెన్షనర్లు, వయోవృద్ధుల సంఘం ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

### హెడ్ కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



హెడ్‌కానిస్టేబుల్‌కు చిహ్నం అందిస్తున్న ఎస్పీ

**జగిత్యాలక్రైం:** జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న శ్రీనివాస్ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. బుధవారం జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేలా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ నటేశ్ పాల్గొన్నారు.

**కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థికసాయం**

కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ గుండెపోటుతో మృతిచెందిన ఆంజనేయులు కుటుంబానికి బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు భద్రత పథకం కింద మంజూరైన రూ.8 లక్షల చెక్కును ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటీవ్ అధికారి అమర్‌నాథ్ పాల్గొన్నారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**మెట్‌పల్లిరూరల్:** అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు.బుధవారం మెట్లచిట్టాపూర్ నుంచి మెట్‌పల్లి వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి,కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

### వృద్ధురాలి ఆత్మహత్య

**ధర్మపురి:** కడుపు నొప్పితో ఓ వృద్ధురాలు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నక్కలపేటలో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ సలీం కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అనపురం లక్ష్మి (65) కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకుండాపోయింది. నొప్పి భరించలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం అర్ధరాత్రి ఇంటిపక్కనున్న సొంత వ్యవసాయ బావిలో దూకింది. తల్లి కనిపించడం లేదని కొడుకు తిరుపతి గాలించగా బావిలో శవమై తేలింది. హెడ్ కానిస్టేబుల్ సలీం ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆమె భర్త శంకరయ్య గతంలోనే మరణించాడు. కుమారుడు తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

# ఘనంగా గోదా రంగనాథుల కల్యాణం



**కథలాపూర్:** మండలంలోని దూలూర్ రామాలయంలో గోదాదేవి- రంగనాథుల కల్యాణం బుధవారం నిర్వహించారు. ప్రతీ ఏటా ధనుర్మాసంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తామని గ్రామస్తులు పేర్కొన్నారు. ఉత్సవాల్లో మాజీ సర్పంచ్ ఎగ్యారపు శ్రీరాములు, అర్చకులు శ్రీవర్ధనాచార్యులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



**మెట్‌పల్లిరూరల్:** మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో గోదాదేవి రంగనాథుల కల్యాణం బుధవారం ఘనంగా నిర్వహించారు.ఆధ్వర్యంలో ధ్యనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జరిపిన ఈ కల్యాణానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటేశ్వర్లు భక్తులు పాల్గొన్నారు.

# సమస్యలు తెలుసుకునేందుకే 'గుడ్ మార్నింగ్ కోరుట్ల'

**కోరుట్ల రూరల్:** నియోజకవర్గంలోని ప్రతీ గల్లీలో సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే 'గుడ్ మార్నింగ్ కోరుట్ల' నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని అయిలాపూర్‌లో బుధవారం ఉదయం 7 గంటల నుంచి 9.30 వరకు గుడ్ మార్నింగ్ కోరుట్లలో భాగంగా ఎమ్మెల్యే గ్రామంలోని పలు వీధులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వీధుల్లో విద్యుత్ స్తంభాలు, డ్రైయినేజీలు, సీసీ రోడ్లు,మిషన్ భగీరథ, తదితర సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కరించాలని సూచించారు. గ్రామం నుంచి బీసీ వెల్ఫేర్ హాస్టల్ తరలించటాన్ని పలువురు ఎమ్మెల్యేతో చెప్పగా బీసీ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం తిరిగి తెప్పించే ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పిడుగు రాధ, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, ఎంపీటీసీ బోడ గంగాదర్, మండల పంచాయితీ అదికారి నీరజ, విద్యుత్ ఏడీ ఆంజనేయరావు, మిషన్ భగీరథ అధికారులు,మెడికల్ ఆఫీసర్, సూపర్‌వైజర్ ధనుంజయ, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



అయిలాపూర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

**సహకార సంఘాల బలోపేతానికి చేయూతనివ్వాలి**

**మల్లాపూర్:** సహకార సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి చేయూతనివ్వాలని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని సిరిపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ బద్దం అంజిరెడ్డితో కలిసి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలోసీఈవో రాజేశ్వర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సుధాకర్ రెడ్డి, డైరెక్టర్లు ఏనుగు ప్రవీణ్‌రెడ్డి, జక్కుల గంగరాజు, మాసుల చిన్నయ్య, పెంట శ్రీనివాస్, ఇప్ప లక్ష్మి, లింగాల స్వామి, పెంట రవి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# కార్మికులను రెచ్చగొట్టడం సరికాదు

**మెట్‌పల్లి:** వేతనాల కోసం కార్మికులను రెచ్చగొట్టడం సరికాదని మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. పట్టణంలో బుధవారం ఆమె మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలతో పాటు ప్రజాపాలన కార్యక్రమాలతో కార్మికులకు వేతనాల చెల్లింపుల్లో జాప్యం జరిగిందన్నారు. మున్సిపల్ నుంచి మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు డీజిల్ వాడుకుంటున్నారని నాయకులు ఆరోపించడం వారి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. ఖాదీ కాంప్లెక్స్‌పై కూడా అనవసర రాద్ధాంతం చేస్తున్నారని, ఈ విషయంలో అధికారులు నిబంధనల ప్రకారం నడుచుకుంటున్నారన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కొందరు నాయకులు మాజీ ఎమ్మెల్యేపై అసత్య ప్రచారం చేస్తున్నారని, దీనిని మానుకోవాలన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, కౌన్సిలర్లు ఉన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుజాత

### జాతీయస్థాయి క్రాస్‌కంట్రీ పోటీలకు ఎంపిక



**వెల్గటూర్:** ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన సబ్బ మనీష జాతీయస్థాయి క్రాస్ కంట్రీ పరుగు పందెం పోటీలకు ఎంపికైనట్లు జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి, కోశాధికారి బైకని కొమురయ్య తెలిపారు. డిసెంబర్ 23న కామారెడ్డిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల సీనియర్ విభాగంలో జగిత్యాల జిల్లా తరుపున పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 15వ తేదీన బీహార్‌లోని గయాలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరుపున మనీష పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలువురు మనీషను అభినందించారు.

**రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థి..**

**ధర్మపురి:** మండలంలోని మగ్గిడిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి ఎస్ చందు డిసెంబర్ 31న జగిత్యాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ -14 కబడ్డీ జూనియర్ విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 12న కామారెడ్డిలో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ రాజమణి, పీఈటీ, పీడీ సంతోష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందిచారు.

# ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

**మల్యాల:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధ్యాపకులు కృషి చేయాలని, సబ్జెక్టుల వారిగా వెనకబడిన విద్యార్థులపై దృష్టిసారించాలని జగిత్యాల జిల్లా నోడల్ అధికారి బొప్పరాతి నారాయణ అన్నారు. మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్(475) క్యాలెండర్‌ను బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ మోతె శివరాంతో కలిసి ఆవిష్కరించారు. విద్యార్థుల ఆకలి తీర్చేందుకు అధ్యాపకులతో విరాళాలతో మధ్యాహ్న భోజనం అమలు చేయడం అభినందనీయమన్నారు. ఇంటర్మీడియేట్‌లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్(475) జిల్లా ప్రధాన కార్యదర్శి అత్తినేని శ్రీనివాస్,మహిళా కార్యదర్శి వేనపల్లి సంధ్య, ఉపాధ్యక్షుడు మహ్మద్ నవాబ్, కార్యదర్శి యముల శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిలర్ కాశవేని శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జిల్లా నోడల్ అధికారి

### ఎరువుల దుకాణాల్లో తనిఖీ

**పెగడపల్లి:** మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఏవో వినీల బుధవారం తనిఖీ చేశారు. ఎరువులు, క్రిమిసంహారక మందులను ఆమె పరిశీలించి నమూనాలు సేకరించారు. ఎరువుల ధరలు పెంచి విక్రయించ కూడదని, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన సరుకులకు బిల్లులివ్వాలని, దుకాణంలో ధరల పట్టిక ప్రదర్శించాలని పేర్కొన్నారు. ఆమె వెంట ఏఈవో నవీద్ ఉన్నారు.

# న్యాయం గెలిచింది .. అవిశ్వాసం ఓడింది

**వెల్గటూర్:** న్యాయమే గెలిచింది, అవిశ్వాసం ఓడిందని వెల్గటూర్ ఎంపీపీ కూనమల్ల లక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. దళిత ఎమ్మెల్యే నియోజకవర్గంలో దళిత మహిళా ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటించడం, దానికి స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు, బెదిరింపులకు గురి చేసినా బీఆర్ఎస్ పార్టీ ఎంపీటీసీలు ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా న్యాయం కోసం నిలబడ్డారని, సహకరించిన ఎంపీటీసీలకు కృతజ్ఞతలు తెలియజేశారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అవిశ్వాస పరీక్షలో తాను విజయం సాధించేందుకు ఎంతగానో కృషి చేశారని, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంచందర్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, సింగిల్ విండో చైర్మన్ రత్నాకర్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ కూనమల్ల లక్ష్మి

### రాములోరి అక్షింతలు ఊరేగింపు



**కథలాపూర్:** మండలంలోని తక్కళ్లపెల్లిలో బుధవారం రథంపై శ్రీరాముడి చిత్రపటంతో గ్రామస్తులు ఊరేగింపు చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ప్రజలకు పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ మొలిగె లక్ష్మి, ఆలయ కమిటీ చైర్మన్ జిల్లా సత్యం, జైపాల్‌రెడ్డి, కర్ణాకర్, తోట గంగారెడ్డి, రంగు గంగారాం పాల్గొన్నారు.

# దరఖాస్తుల ఆన్‌లైన్ వేగవంతం చేయాలి

**మల్లాపూర్:** ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. మల్లాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలించారు. తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజశ్రీనివాస్, ఎంపీవో జగదీశ్, పంచాయతీ కార్యదర్శులు, ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరఖాస్తుల్లోని ఆధార్, రేషన్‌కార్డు, సెల్‌నంబర్లు సరిచూసుకుని దరఖాస్తులను తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నారు. గడువులోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు, మండల పరిషత్, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన**

**ఇబ్రహీంపట్నం:** ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరుట్ల ఆర్డీవో రాజేశ్వర్ డీటీపీ ఆపరేటర్లకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో టీఆర్‌డీఈవో నరేశ్, ఎంపీవో కృపాకర్, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ రమేశ్, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి పాల్గొన్నారు.

### పల్లె దవాఖాన సేవలు వినియోగించుకోవాలి

**కథలాపూర్:** పల్లె దవాఖానాల్లో వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి సింధూజ అన్నారు. మండలంలోని భూషణరావుపేటలో బుధవారం పల్లె దవాఖానాను ఆమె తనిఖీ చేశారు. గర్భిణులకు, బాలింతలకు చికిత్సలు, ఆరోగ్య సలహాలు అందిస్తున్నతీరును పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరిగి ప్రజారోగ్యం వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భూషణ్, ఏఎన్ఎం గంగనర్సు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారి

### ముందస్తు సంక్రాంతి సంబరాలు



**జగిత్యాల:** జగిత్యాల జిల్లా పీఆర్టీయూ శాఖ ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగి మంటలు ఏర్పాటు చేసి సందడి చేశారు.కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమునరాణి, మహిళ కార్యదర్శి అనిత, చందన, శశికళ, శ్రీదేవి,పుష్పలత పాల్గొన్నారు.

జిల్లా కేంద్రంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించగా విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ఈశ్వర్‌కుమార్, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారి, మద్యం వ్యాపారి మధ్య ఆడియో కలకలం

**మెట్‌పల్లి:** బెల్ట్ దుకాణాలకు మద్యం అమ్మకాల విషయంలో ఎక్సైజ్ అధికారికి.. ఓ బార్ భాగస్వామికి మధ్య జరిగిన ఆడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. సదరు వ్యాపారి అధికారికి ఫోన్ చేసి తమ బార్ నుంచి మద్యం కొనుగోలు చేస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకుడి వద్దకు వెళ్లి ఎందుకు బెదిరించారని ప్రశ్నించారు. దీనికి అధికారి బార్ల నుంచి మద్యం బయటకు పోవొద్దని, అవసరమైతే వైన్స్ షాపుల నుంచి తెప్పించుకోమనండంటూ బదులిచ్చారు. 'ఓ అధికారిగా మీరు బెల్ట్‌షాపులకు వైన్స్ షాపుల నుంచి తెప్పించుకోమని ఎలా చెప్పగలుగుతున్నారు..' అంటూ వ్యాపారి నిలదీశారు. ఇలా ఇరువురి మధ్య మాటలు పెరిగి తీవ్ర వాగ్వాదం జరిగింది. ఇదంతా వ్యాపారి ఫోన్‌లో రికార్డు చేసి అనంతరం ఆ ఆడియోను పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్ట్ చేశాడు. విషయం తెలుసుకున్న అధికారి మళ్లీ వ్యాపారికి ఫోన్ చేసి.. రికార్డు చేసి వాట్సాప్ గ్రూపుల్లో ఎందుకు వైరల్ చేస్తున్నావని దబాయించారు. తిరిగి ఇద్దరి మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. చివరకు 'అసలు నువ్వు లైసెన్స్ హోల్డర్‌వే కాదు అని అధికారి అంటే.. డబ్బుల కోసం మీరు నాకేందుకు ఫోన్ చేశారు.' అని వ్యాపారి ప్రశ్నించారు. నిన్ను డబ్బులు అడిగినట్లు ఆధారాలు ఉంటే ఫిర్యాదు చేసుకోవచ్చని అధికారి అనగా, ఉన్నాయని వ్యాపారి చెప్పారు. ఆ తర్వాత అధికారి పరోక్షంగా డబ్బులు అడిగినట్లు ఉన్న ఆడియోను కూడా వ్యాపారి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం చర్చనీయాంశమైంది.

### లారీ డ్రైవర్ల స్టీరింగ్ డౌన్

**జగిత్యాలటౌన్:** హిట్ అండ్ రన్ చట్టంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన కఠినమైన శిక్షలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ జగిత్యాల లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ డ్రైవర్లు బుధవారం స్టీరింగ్ డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. అంతకు ముందు పట్టణంలో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సవరించి కఠినంగా మార్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈనెల 14 అర్ధరాత్రి వరకు లారీల బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న లారీ డ్రైవర్లు

## సంక్షిప్త వార్తలు

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు**

**కోరుట్ల:** పట్టణ శివారులోని బొమ్మెన క్రాస్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మల్లాపూర్ మండలం రాఘవపేటకు చెందిన రాజం, గంగాధర్ బైక్‌పై జగిత్యాల వైపు వెళ్తూ.. జగిత్యాల వైపు నుంచి కోరుట్లకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీ కొన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని అంబులెన్స్‌లో జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. అదే సమయంలో జగిత్యాల నుంచి కోరుట్ల వస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ తన వాహనాన్ని ఆపి క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రి తరలించే వరకూ సహకరించారు.

**మెగా డీఎస్సీ నిర్వహించాలి**

**జగిత్యాలటౌన్:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 40 వేల టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ కోరారు. జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం అనంతరం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మెగా డీఎస్సీ నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే విద్యాశాఖ అధికారులు మాత్రం 10 నుంచి 12వేల ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఉన్నాయంటూ తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఈశ్వరయ్య, శ్రీహరి, కొక్కు గంగాధర్, తిరుపురం రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

**పూరి గుడిసె దగ్ధం**

**సారంగాపూర్:** మండలంలోని కోనాపూర్‌లో రాపాల మల్లవ్వకు చెందిన పూరి గుడిసె బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైయింది. వివరాలి విధంగా ఉన్నాయి. మల్లవ్వ సట్టి మల్లన్నకు ఉపవాస దీక్ష చేస్తున్న క్రమంలో దీపం వెలిగించి బయటకు వెళ్లగా ప్రమాదవశాత్తు పూరి గుడిసెకు అంటుకుని గుడిసె పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో నిత్యావసర వస్తువులు, బట్టలు, ధాన్యం, కొంత నగదు కాలిపోయిందని, రూ. 1 లక్ష వరకు నష్టం వచ్చినట్లు బాధితురాలు రోదించింది. ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని సర్పంచ్ ఆకుల జమున పేర్కొన్నారు.

**సావిత్రిబాయిని ఆదర్శంగా తీసుకోవాలి**

**రాయికల్:** సావిత్రిబాయి పూలేను నేటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. పట్టణంలోని బాలికల పాఠశాలలో ప్రజాచైతన్య వేదిక వ్యవస్థాపకులు చింతకుంట సాయికుమార్ ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వారోత్సవాల్లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం మహిళ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తురగ శ్రీధర్‌రెడ్డి, మ్యాకల అనురాధ, ఓబీసీ సమైక్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడకుంట్ల జగదీశ్వర్, లయన్స్‌క్లబ్ డీసీ మ్యాకల రమేశ్, హెచ్ఎం శ్రీపతి రాఘవులు, నాయకులు పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి**

**మల్లాపూర్:** విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలను పెంచి ప్రాథమిక విద్య బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సెక్టోరియల్ అధికారి రాజేశ్ అన్నారు. మండలంలోని చిట్టాపూర్ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే సకల వసతులు, సుశిక్షితులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం పిన్నంశెట్టి శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్ మహేశ్, రాజేశ్, సీఆర్పీ విజేయేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి**

**ధర్మపురి:** విద్యార్థులలో సృజనాత్మకతను మెరుగుపరిచేలా విద్యాసంబంధ ప్రదర్శనలను ఏర్పాటు చేయడం అవసరమని తహసీల్దార్ కృష్ణ చైతన్య అన్నారు. పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్‌లో ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని ప్రారంభించి విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలను,చిత్రాలను పరిశీలించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను,సృజనాత్మకతను పెంపొందించడానికి ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్‌శర్మ, ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్ గట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రైస్ మిల్‌లో అధికారుల తనిఖీ

**ఇబ్రహీంపట్నం:** మండలంలోని తిమ్మాపూర్‌లో ఓ రైస్‌మిల్‌ను బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. మాజీ ఎంపీపీ నేరేళ్ల దేవేందర్ శ్రీ వెంకటలక్ష్మీనర్సింహా ఇండస్ట్రీస్ పేరున రైస్‌మిల్‌ను నిర్మిస్తున్నారు. ఈ రైస్‌మిల్ నిర్మాణ దశలో ఉండగానే సివిల్ సప్లయ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ధాన్యంను అలాట్‌మెంట్ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సివిల్ సప్లయ్ కమిషనర్ దేవేంద్ర చౌహాన్‌కు గ్రామానికి సల్ల సునీల్ ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదుతో పై అధికారుల ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారి ప్రభాకర్ ఆధ్వర్యంలో రైస్‌మిల్‌ను, కోళ్లఫారంలో నిల్వ ఉంచిన ధాన్యం బస్తాలను పరిశీలించారు. నిర్మాణం పూర్తికాని రైస్‌మిల్‌కు ధాన్యం ఎలా కేటాయించారని విలేకర్లు అడిగిన ప్రశ్నకు జిల్లా పౌరసరాఫరాల శాఖ అధికారి కేటాయించారని ఆయననే అడిగి తెలుసుకోవాలని అధికారులు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు కృష్ణ, జంగయ్య, లక్ష్మారెడ్డి, సివిల్‌సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ఉమాపతి పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

# ఉపాధి పనుల్లో తేడాలు రానీయొద్దు

**ఇబ్రహీంపట్నం:** ఉపాధి హామీ పనుల్లో తేడాలు రానీయొద్దని, కూలీలందరికీ పని కల్పించాలని డీఆర్‌డీవో నరేష్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి పనులపై 14వ విడత సామాజిక తనిఖీ నివేదిక చేపట్టారు. కూలీలకు ఎక్కువ రోజులు పని కల్పించాలని, రికార్డుల్లో సరిగ్గా నమోదు చేయాలని తెలిపారు. నర్సరీల్లో మొక్కలు పెంచి జూన్ వరకు నాటేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. మండలంలోని 17 గ్రామాల్లో జూన్ 2022 నుంచి మార్చి 2023 వరకు చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. డీఆర్పీలు చదివి వినిపించారు. అవకతవకలకు పాల్పడిన ఫిల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ.68,844 రికవరీ చేసినట్లు తెలిపారు. ఎంపీవో కృపాకర్, ఉపాధి హామీ జిల్లా విజిలెన్స్ అధికారి చిన్నయ్య, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, క్వాలిటీ కంట్రోలర్ అధికారి ప్రసాద్, అసిస్టెంట్ సోషల్ ఆడిట్ అధికారి దేవేందర్‌రెడ్డి, ఎస్ఆర్‌పి తిరుపతి, ఏపీవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.